# బిరుదురాజు రామరాజు



బిరుదురాజు రామరాజు 1925 ఏప్రిల్ 16 వ తేదీ దేవనూరు గ్రామంలో లక్ష్మీదేవమ్మ, బిరుదురాజు నారాయణరాజు దంపతులకు జన్మించాడు. ఇతని ప్రాథమిక విద్యాభ్యాసం వరంగల్ జిల్లామడికొండ లో నడిచింది. మూడవ తరగతి నుండి ఇంటర్మీడియెట్ వరకు ఉర్దూ మీడియంలో చదువుకున్నాడు. మెట్రిక్ చదివేటప్పుడు 11వ ఆంధ్రమహాసభల సందర్భంగా మహాత్మాగాంధీవరంగల్ వచ్చినప్పుడు ఇతడు ఆ సభలలో వాలంటీర్‌గా పాల్గొన్నాడు. మహాత్మాగాంధీ తో కలిసిపాదయాత్ర చేశాడు. వరంగల్ లో చదువుకునే రోజుల్లో ఇతనిపై ఆర్యసమాజం ప్రభావం ఎక్కువగా ఉండేది. ఆ తరువాత హైదరాబాదు లోని నిజాం కళాశాల లో బి.ఎ. చదువుకున్నాడు. ఆ సమయంలో దాశరథి కృష్ణమాచార్య తో పరిచయం కలిగింది. నిజాం వ్యతిరేక రాజకీయోద్యమాలలో చురుకుగా పాల్గొన్నాడు.

కాళోజీ నారాయణరావు, టి.హయగ్రీవాచారి, ముదిగొండ సిద్ద రాజలింగం, జమలాపురం కేశవరావుమొదలైన యువనాయకులతో కలిసి రజాకార్ల ఉద్యమం, స్టేట్ కాంగ్రెస్ ఉద్యమాలలో పాల్గొని 1947లో మూడు నెలలపాటు కారాగారశిక్ష అనుభవించాడు. 1947-50ల మధ్యకాలంలో నిజాం కళాశాల లో తెలంగాణా విద్యార్థి సంఘానికి అధ్యక్షుడిగా ఉన్నాడు. బి.ఎ.తరువాత న్యాయశాస్త్రంలో పట్టా పొందాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీలో ఎం.ఎ. చదివే రోజులలో విద్యార్థి నాయకుడిగా గుర్తింపుపొందాడు. ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో అనుమతి లేకుండా కవిసమ్మేళనం నిర్వహించినందుకు అరెస్ట్ కూడా

అయ్యాడు. ఎం.ఎ. చదివే సమయంలో సి.నారాయణరెడ్డి తో కలిసి కొంతకాలం రామనారాయణకవులు అనే పేరుతో జంటకవులుగా కవిత్వం చెప్పాడు. మాడపాటి హనుమంతరావు ఆంధ్రసంఘం నెలకొల్పి దానికి బిరుదురాజు రామరాజును అధ్యక్షుడిగా నియమించాడు. తెలంగాణా రచయితల సంఘం ఇతడు మొదటి కార్యదర్శిగా ప్రారంభమైంది. ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన తరువాత ఇది ఆంధ్ర రచయితల సంఘంగా మారింది. దీనికి ఇతడు మొట్టమొదటి కార్యదర్శి. ఎం.ఎ. పూర్తి అయ్యాక ఇతడు ఖండవల్లి లక్ష్మీరంజనం మార్గదర్శకత్వంలో తెలుగుజానపద గేయసాహిత్యం అనే అంశంపై పరిశోధన చేసి దక్షిణ భారతదేశంలోనే జానపదసాహిత్యంపై మొట్టమొదటి పి.హెచ్.డి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి సంపాదించాడు.సంస్కృతం లో ఎం.ఎ. చేసి అందులో కూడా డాక్టరేట్ పొందాడు.

ఇతడు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 1951లో ఉపన్యాసకుడిగా చేరి అంచెలంచెలుగా తెలుగుశాఖకు డీన్‌గా, అధ్యక్షుడిగా ఎదిగాడు. ఇతని మార్గదర్శకత్వంలో 37 మంది పిహెచ్.డి పట్టాలు పొందారు. ఇతని పర్యవేక్షణలోనే కేతవరపు రామకోటిశాస్త్రి, కోవెల సుప్రసన్నాచార్య, ముదిగొండ వీరభద్రశాస్త్రి, అక్కిరాజు రమాపతిరావు, అనంతలక్ష్మి, రవ్వా శ్రీహరి వంటి వారు తమ పరిశోధనలు చేసి డాక్టరేట్ పట్టాలను పొందారు. ఇతడు 1983లో ప్రొఫెసర్‌గా పదవీ విరమణ చేశాడు.